క్లుప్తంగా

ఉల్లాస్ యాప్‌పై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

జిన్నారం (పటాన్‌చెరు): బడి బయట పిల్లలను పాఠశాలలు, కళాశాలలో చేర్పించడం, స్వయం సహాయక గ్రూపులోని నిరక్షరాస్యులైన మహిళలను చదివించడం, రాయించడం నేర్పించాలనే ఉద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లాస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారని ఎంపీడీఓ ఉమాదేవి అన్నారు. మంగళవారం సాక్షర భారత్ కార్యక్రమంలో భాగంగా ఉల్లాస్ సమావేశం నిర్వహించి మొబైల్ యాప్‌కు సంబంధించిన నమోదు విధానంపై ఐకేపీ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, స్వయం సహాయక బృందాల మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను మంగళవారం కార్పొరేటర్ పుష్ప పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రజలకు ఇబ్బంది లేకుండా త్వరగా పూర్తి చేయాలని కోరారు. సీసీ రోడ్డును అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం శివకృష్ణ, మేనేజర్ లోకేష్, నాయకులు పీటర్, సామ్రాట్, హబీబ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పత్తిలో అరకతో కలుపుతీత


అరకతో పత్తి సాళ్లలో కలుపుతీత పనులు

మునిపల్లి(అందోల్): ఆయా గ్రామాల్లో రైతులు పత్తి పంటలో అరకతో కలుపుతీత పనులు నిర్వహిస్తున్నారు. మంగళవారం మండలంలోని పిల్లోడి, మన్‌సాన్‌పల్లి, తాటిపల్లి, పెద్దలోడి గ్రామాల్లో పత్తి సాళ్లల్లో అరకతో కలుపుతీస్తున్నారు. మరికొందరు రైతులు దాట్లు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కూలీల కొరతను నివారించేందుకు రైతులు అరకతో కలుపుతీస్తున్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

సదాశివపేటరూరల్(సంగారెడ్డి): విద్యాభివృద్ధికి రేవంత్‌రెడ్డి సర్కార్ కృషి చేస్తోందని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆత్మకూర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొని చిన్నారుల చేత అక్షరాలు దిద్దించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులపై భారాన్ని తగ్గించేందుకే ప్రభుత్వం చిన్నారుల కోసం ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, సీడీపీ ఓ చంద్రకళ, మండల విద్యాధికారి శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన్న, మార్కెట్ డైరెక్టర్ ఇసుఫ్, నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన


పరిసరాలు శుభ్రం చేస్తున్న జేసీబీ

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో వందరోజుల ప్రణాళిక కార్యక్రమం కొనసాగుతోంది. మంగళవారం తడి పొడి చెత్తను వేరు చేసి ఎరువు తయారు చేసే విధానాన్ని పోచమ్మ బస్తీవాసులకు కమిషనర్ మధుసూదన్ రెడ్డి అవగాహన కల్పించారు. అలాగే, స్వచ్ఛత, ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధుల నివారణకు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు నర్సింలు, మల్లికార్జున్ స్వామి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఏపీజే అబ్దుల్ కలామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డా. బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానించారు. బీఏ, బీకాం, బీఎస్సీలో తొలి సంవత్సరం ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ సర్వీస్ పోర్టల్ ద్వారా చేసుకోవచ్చని చెప్పారు. ఆగస్టు 13 లోపు సమన్వయకర్త యోగిబాబును సంప్రదించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 7382929636 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

గుంతలమయంగా రహదారి

- ఇబ్బందుల్లో వాహనదారులు
- ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టని వైనం


తుమ్మన్ పల్లి గ్రామ శివారులో ఏర్పడిన గుంత

ఝరాసంగం, (జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతో ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. మండలంలోని ప్రధాన రహదారి కప్పాడ్ నుంచి జహీరాబాద్ వరకు ఝరాసంగం మీదుగా ఆర్‌అండ్‌బీ రహదారి ఉంది. నిత్యం వివిధ గ్రామాల ప్రజలు జహీరాబాద్ పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి అధ్వానంగా తయారయింది. వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా నిర్వహణ

మండలంలోని ప్రధానంగా ఉన్న ఆర్‌అండ్‌బీ నిర్వాణ అస్తవ్యస్తంగా తయారయ్యింది. ఈ రహదారి గుండా జహీరాబాద్ నియోజకవర్గంలో పాటు అందోల్, నారాయణఖేడ్, నిజామాబాద్, బాన్సువాడ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ఝరాసంగం ప్రధాన రహదారి మీదుగా నిత్యం వందలాది సంఖ్యల్లో వాహనాల రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా ఝరాసంగంలోని శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయానికి కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ఈ ప్రధాన రహదారిపై చాలా చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కురిసే వర్షాలకు గుంతలు మరింతగా పెద్దగా అయ్యే అవకాశం ఉందని వాపోతున్నారు. అదేవిధంగా రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు వేపుగా పెరిగాయి. ముఖ్యంగా మూల మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు.


కుప్పానగర్ శివారులో గుంతలు

పట్టించుకోని అధికారులు

ప్రమాదాలు జరిగి మృత్యువాత పడటంతో పాటు గాయాలవుతున్న సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. కనీసం రహదారులను పరిశీలించే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మహాశివరాత్రి సందర్భంగా రహదారుల మరమ్మతులు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా సంబంధిత అధికారులు మాత్రం మట్టి పోసి చేతులు దులుపుకొన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకొని మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలు

రహదారి అస్తవ్యస్తంగా మారడంతో రాకపోకలు వాహనదారులు, ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రుల సమయంలో గుంతలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మూలమలుపుల వద్ద వచ్చే వాహనాలు కనిపించక నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయి.

మోదీ పాలనలోనే రైతు సంక్షేమం

ఎంపీ రఘునందన్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ

జిన్నారం (పటాన్‌చెరు): ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో ప్రపంచ దేశాలకు దీటుగా భారతదేశం ఆర్థికంగా స్థిరపడిందని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన రైతులతో ప్రత్యక్ష సంభాషణ సమావేశానికి ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, రైతులకు మద్దతుగా తీసుకున్న నిర్ణయాలను రైతులకు ముఖాముఖి సమావేశంలో వివరించారు. రానున్న ఖరీఫ్ సాగుకు డీఏపీ సబ్సిడీ నేరుగా రైతుల ఖాతాల్లో వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షురాలు గోదావరి, జిల్లా నాయకులు రాజేందర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నరసింహారెడ్డి, రాములు, రాజశేఖర్ రెడ్డి, శామల అంజిరెడ్డి, మండల అధ్యక్షులు జగన్ రెడ్డి, ఐలయ్య, నాయకులు రాజిరెడ్డి, రైతుసంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

సాకారం కానున్న సొంతింటి కల

మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి


శంకుస్థాపన చేస్తున్న ఏఎంసీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి

వట్‌పల్లి(అందోల్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదోడి సొంతింటి కల నెరవేరుతుందని జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం అందోల్ మండలంలోని అల్మాయిపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఇళ్ల నిర్మాణ పథకం పేదలకు వరంగా మారిందన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సోమనారాయణ, అల్మాయిపేట మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శివరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మందుబాబులకు జరిమానా**

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో 10 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా ఏడుగురికి రూ. వెయ్యి, ముగ్గురికి రూ.1500 చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ **సైన్ బోర్డు ఉర్దూలో రాయాలి**

జహీరాబాద్‌టౌన్: జహీరాబాద్ రైల్వే గేటు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేస్తున్న సైన్ బోర్డుపై ఉర్దూ, హిందీ భాషాలో రాయాలని ఎంఐఎం, ముస్లిం సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. రైల్వే గేటుపై నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జిని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. మంగళవారం బ్రిడ్జిపై సైన్ బోర్డు ఏర్పాటు చేస్తుండగా ఎంఐఎం, ముస్లిం సంఘాల నాయకులు అక్కడికి చేరుకుని నిరసన తెలిపారు. బోర్డుపై ఉర్దూ, హిందీ భాషల్లో రాయలేదని అధికారులతో వాగ్వాదానికి దిగారు. నిరసనకారులతో ఆర్‌అండ్‌బీ ఏఈ సంధ్య మాట్లాడారు. బోర్డుపై ఉర్దూ, హిందీ భాషల్లో రాస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

◆ **ఆర్టీసీ డిపో సందర్శన**

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఆర్టీసీ డిపోను మంగళవారం హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషా ఖాన్ సందర్శించారు. డిపోలోని అన్ని సెక్షన్లు బస్‌స్టేషన్, పార్శిల్ కౌంటర్, గ్యారేజ్, వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ స్వామి ఇతర ఉద్యోగులు, కార్మికులతో మాట్లాడారు. ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించాలని, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల వైపు తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు ఇప్పుడు అందిస్తున్న సేవలు భేష్‌గా ఉన్నాయని అభినందించారు.

◆ **పటాన్‌చెరు ఎస్ఐగా మహేశ్వర్ రెడ్డి**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎస్ఐగా మహేశ్వర్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కంది సీసీఎస్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మహేశ్వర్‌రెడ్డి బదిలీపై పటాన్‌చెరు వచ్చారు. ముందుగా డీఎస్పీ ప్రభాకర్, పటాన్‌చెరు సీఐ వినాయక్‌రెడ్డిలను కలసి పూల మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు.

◆ **మంత్రి వివేక్‌ను కలిసిన నేతలు**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్‌ను స్థానిక నాయకులు మర్యాదపూర్వంక కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఓబీసీ అధ్యక్షుడు మహీన్‌గౌడ్ మాట్లాడుతూ.. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మంత్రి వివేక్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా, పీసీసీ ప్రధాన కార్యదర్శి బాలమురళీకృష్ణ, డీసీసీ ఉపాధ్యక్షుడు అరుణ్ గౌడ్ పాల్గొన్నారు.

◆ **ఆవుకు అంత్యక్రియలు**

జహీరాబాద్: ప్లాస్టిక్ కవర్లు తిని మూడు రోజుల పాటు తీవ్ర అస్వస్థతకు గురై మరణించిన ఆవుకు రైతులు అంత్యక్రియలు నిర్వహించారు. మంగళవారం మండలంలోని హోతి(కె) గ్రామంలో ఓ ఆవు జహీరాబాద్ పట్టణంలో రోడ్లపై సంచరిస్తూ ప్లాస్టిక్ కవర్లను తిని అస్వస్థతకు గురైంది. గో ప్రేమికులు వైద్యం అందించినా కోలుకోలేదు.. మంగళవారం మరణించింది. ఆవు వెంట ఉన్న లేగదూడను ఓ రైతుకు అప్పగించారు.

◆ **నేడు అమ్మవారి చీరల వేలం**

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడెం గ్రామంలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో వేలంపాట నిర్వహించనున్నారు. ఉ.10 గంటలకు అమ్మవారి చీరలు, ఒడిబియ్యం, పార్కింగ్, షాపు నంబర్7 హోటల్ నిర్వహణ మూడు సంవత్సరాల కాలపరిమితికి సంబంధించి పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ. శశిధర్ గుప్తా, ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ధర్మకర్తల మండలి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

◆ **ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలి**

రాయికోడ్(అందోల్): ఐదు సంవత్సరాలు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని రాయికోడ్ పీఎస్ హెచ్‌ఎం బి.శ్రీనివాస్ తల్లిదండ్రులను కోరారు. రాయికోడ్‌లోని బుడగ జంగాలవాడలో మంగళవారం విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించడానికి బడిబాట 'నమోదు డ్రైవ్' కార్యక్రమంలో భాగంగా పర్యటించారు.

నేడు రైతు భరోసాకు చివరి తేదీ

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని రైతులకు రైతుభరోసా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగా పాస్‌బుక్ వచ్చిన డిజిటల్ సైన్ పూర్తయిన రైతులు ఇదివరకు రైతు భరోసాకు దరఖాస్తులు చేసుకోని రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సంబంధిత పత్రాలను వ్యవసాయ విస్తీర్ణ అధికారికి అందించాలని సూచించారు. పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంక్ అకౌంట్, జిరాక్స్ అందజేయాలని సూచించారు.

మీసేవల్లో అధిక ధరలు తీసుకోవద్దు

సంగారెడ్డి టౌన్: మీసేవ కేంద్రాల్లో అధిక ధరలు తీసుకోవద్దని సంగారెడ్డి మండల తహసీల్దార్ జయరాం అన్నారు. మంగళవారం మండలంలోని మీసేవ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీసేవ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలు మాత్రమే వసూలు చేయాలని అంతకంటే ఎక్కువ వసూలు చేస్తే నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెట్టి మీసేవలను సీజ్ చేస్తామన్నారు. అనంతరం నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో మండల అధికారులు, మీసేవలు పాల్గొన్నారు.

హారికకు పీహెచ్‌డీ పట్టా

పటాన్‌చెరు: మండలం పరిధి రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని హారిక బూర్గుల డాక్టరేట్‌కు అర్హత సాధించారు. హైబ్రిడ్ నియర్ ఆల్జీబ్రా, న్యూట్రోసోఫిక్ నియర్ ఆల్జీబ్రాలోని కొన్ని అంశాలపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.నరసింహ స్వామి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ హారిక చేసిన అత్యుత్తమ పరిశోధన గణిత శాస్త్రాల పురోగతికి గణనీయంగా దోహదపడుతుందని తెలిపారు. డాక్టర్ హారిక సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడంపై గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

కార్పొరేట్ ప్రయోజనాలకే పెద్దపీట

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రజల సెంటిమెంట్‌తో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పరిపాలన చేస్తుందని.. కార్పొరేట్ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు వీరయ్య ఆరోపించారు. మంగళవారం సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివాసులను అడవుల నుంచి గెంటేయాలనే పథకం ప్రకారం దాడి జరుగుతుందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌ను రద్దును వ్యతిరేకిస్తూ జూలై 9న దేశవ్యాప్త సమ్మె నిర్వహించనున్నట్లు చెప్పారు. మోదీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను విస్మరిస్తూ పెట్టుబడిదారులు, కార్పొరేట్ పరిశ్రమలను ప్రోత్సహిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మభ్య పెడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. జహీరాబాద్‌లో నిమ్జ్ పేర భూములు.. సంగారెడ్డిలో ట్రిపుల్ ఆర్ పేరు మీద పేదల భూములు బలవంతంగా గుంజు కుంటున్నారని.. ఈ భూములు 2013 భూ సేకరణ చట్టం ప్రకారమే తీసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కరాములు, జిల్లా కార్యదర్శి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య, మల్లేశం, మాణిక్యం, సాయిలు, రాంచందర్, నర్సింలు జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో సకల సౌకర్యాలు


సమావేశంలో మాట్లాడుతున్న సంధ్యారాణి

హత్నూర(సంగారెడ్డి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి అన్నారు. మంగళవారం హత్నూరలోని బ్రాహ్మణగూడ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారంపై సమావేశం నిర్వహించారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలకు సూపర్‌వైజర్ సంధ్యారాణి అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలు, బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటాపాటలతో కూడిన మెరుగైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కే అనసూయ గ్రామ పెద్దలు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కంది(సంగారెడ్డి): మండల కేంద్రం కందిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు, సిబ్బంది సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. మంగళవారం ఇంటింటికి వెళ్లి వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి సాయిశంకర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఇళ్ల ముందు మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. జ్వరం, విరేచనాలు అవుతున్నవారు ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూళ్లను కట్టడి చేయండి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: అధిక ఫీజు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎంఈఓ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. నిబంధనల ప్రకారం ఫీజులు వసూలు చేస్తూ ఆటస్థలం, అర్హత కలిగిన ఉపాధ్యాయులు, మున్సిపాలిటీ అనుమతులు ఉండాల్సి ఉన్నా పలు విద్యా సంస్థలు అవేవీ పాటించడం లేదని మండిపడ్డారు. పుస్తకాలు, నోట్ బుక్స్, యునిఫాం, బెల్టులు, బూట్లు విక్రయిస్తూ విద్యను వ్యాపారం చేస్తున్నారని వాపోయారు. అలాంటి స్కూళ్లను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు.

జహీరాబాద్ ఎంఈఓగా మాణయ్య


ఎంఈఓ మాణయ్యను సన్మానిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండల ఇన్‌చార్జి విద్యాధికారిగా మాణయ్య నియమితులైయ్యారు. ఈ మేరకు డీఈఓ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. మండల విద్యాధికారిగా ఉన్న బస్వరాజ్ ఇటీవల పదవి విరమణ చేయడంతో ఎంఈఓ పోస్టు ఖాళీగా ఉంది. బూచినెల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న మాణయ్యను ఇన్‌చార్జి ఎంఈఓగా నియమించారు. ఎస్‌జీటీ యూనియన్ నాయకులు నిమ్మల కిష్టయ్య, యూసూఫ్, శివకుమార్, ఎస్‌జీటీయూ సంఘం నాయకులు, బూచినెల్లి గ్రామ బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ తదితరులు మాణయ్యను ఘనంగా సన్మానించారు.

ఆవుకు అంత్యక్రియలు

ప్లాస్టిక్ కవర్లు తిని అస్వస్థతతో మృతి


ఆవువద్ద లేగదూడ

జహీరాబాద్: ప్లాస్టిక్ కవర్లు తిని మూడు రోజుల పాటు తీవ్ర అస్వస్థతకు గురై మరణించిన ఆవుకు రైతులు అంత్యక్రియలు నిర్వహించారు. మంగళవారం మండలంలోని హోతి(కె) గ్రామంలో ఓ ఆవు జహీరాబాద్ పట్టణంలో రోడ్లపై సంచరిస్తూ ప్లాస్టిక్ కవర్లను తిని అస్వస్థతకు గురైంది. గో ప్రేమికులు వైద్యం అందించినా కోలుకోలేదు.. మంగళవారం మరణించింది. ఆవు వెంట ఉన్న లేగదూడను ఓ రైతుకు అప్పగించారు.

డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లు తప్పనిసరి

ఎస్పీ పరితోశ్ పంకజ్


పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ట్రాఫిక్ పోలీస్

సంగారెడ్డి క్రైమ్: మద్యం సేవించి వాహనాలు నడపరాదని, స్కూల్, కళాశాల డ్రైవర్లు ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. మంగళవారం ఉదయం పటాన్‌చెరువు పరిధి జిల్లా ఎస్పీ, ట్రాఫిక్ పోలీస్ సిబ్బందితో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ పాఠశాల డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా, ఎవరు కూడా మద్యం సేవించి వాహనలు నడపలేదని తెలిపారు. ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. ప్రతి స్కూల్, కళాశాల యాజమాన్యాలు తమ డ్రైవర్‌లను విధులల్లోకి అనుమతించు ముందు తప్పనిసారిగా డ్రంకెన్ అండ్ డ్రైవ్ టెస్టులు చేసిన తర్వాతనే విధులల్లోకి అనుమతించాలని సూచించారు. అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒకరు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఎవరైనా తనిఖీల్లో పట్టుపడితే డ్రైవర్‌తో పాటు విద్యా సంస్థల యాజమాన్యాలపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పటాన్‌చెరు టౌన్: విద్యాసంస్థల నుంచి బస్సును బయటకు తీసే క్రమంలో బస్సు డ్రైవర్‌కు డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ తప్పనిసరిగా నిర్వహించాలని ట్రాఫిక్ సీఐ లాల్‌నాయక్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు పరిధిలో ట్రాఫిక్ పోలీసులు విద్యాసంస్థల బస్ డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా సీఐ లాలూనాయక్ మాట్లాడుతూ.. విద్యాసంస్థల బస్సులు డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేసిన తరువాతనే విధులలోకి అనుమతించాలన్నారు. బస్సు డ్రైవర్లు ఎవరైనా ట్రాఫిక్ పోలీసుల తనిఖీలో పట్టుబడితే డ్రైవర్‌తో పాటు విద్యాసంస్థల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు ఆంజనేయులు, పవన్, సిబ్బంది పాల్గొన్నారు.